కథ

# కౌంట జోన

సామాన్యంగా షాపింగ్ పని నా శ్రీమతే చూసుకుంటుంది. కానీ యు.ఎస్.లో చదువుతూ శెలవుల్లో వచ్చిన మా అబ్బాయికి సూట్ తీయాలని ఈవాళ వాళ్లతో నేనూ బయలుదేరా. వాడితో కాస్త కాలక్షేపం చేసినట్లూ వుంటుంది.

'శ్రమసాఫల్యం' ప్రక్కనే 'సాంట్రో'ని పార్కు చేసా, అది అబిడ్స్‌లోని పెద్ద షోరూమ్!

ఎంట్రెన్స్ దాటగానే లోపల మూడు కౌంటర్లున్నాయి. అక్కడ బిల్లింగ్ కంప్యూటర్లలో జరుగుతూంది. ప్రక్కనే గ్లాస్ పార్టీషన్స్ తోటి ఓ ఎ.సి.క్యాబిన్ వుంది. అందులో వున్న వ్యక్తిని ఎక్కడో చూసినట్లనిపిస్తోంది. గుర్తుమాత్రం రావడం లేదు. ఆలోచిస్తూ ముందుకు నడిచా. హాలు ప్రశస్తంగా వుంది. డెకరేటివ్ లైట్స్‌లో అందంగా వుంది. విలువైన వలువల్లో వయ్యారిభామలు సీతాకోకచిలుకల్లా తిరుగుతున్నారు! షాపింగ్ చేయడం ప్లజెంట్‌గా వుంటుందన్న మాట!

మా వాడికి రింకల్ ఫ్రీ ట్రౌజర్స్, షర్ట్స్ చూస్తున్నాం, నేను పేరు మాత్రమే చూస్తున్నా, మనసంతా క్యాబిన్‌లోని మనిషి మీదే! పరిచయమైన ముఖమే! ఎంతోమందికి సర్జరీ చేసా. వాళ్లలో ఎవ్వరో ఒకరు అయ్యుండొచ్చు!

అరగంటలో సెలక్షన్ అయ్యింది. నా శ్రీమతి కూడా ఓ పైఠణీ చీర తీసుకుంది. బిల్ 'పే' చేయడానికి కౌంటర్ దగ్గరకొచ్చాం. బిల్ పే చేస్తూ కౌంటర్‌కేసి మళ్లీ చూసా. అతను ఫోన్‌లో ఏదో మాట్లాడుతున్నాడు. మాట్లాడుతూ ఎడం చేతి చూపుడి వేలుని ఓ రకంగా గుండ్రంగా తిప్పుతూంటే అప్పుడు సడన్‌గా స్ఫురించింది. అతను నా దగ్గర సర్జరీ చేసుకున్న మనిషి కాడు, చిన్ననాటి స్నేహితుడు! ఇంచుమించు ముప్పైయ్యేళ్ల క్రితం కలసి చదువుకున్నాం!

''ఒక్క నిముషం... ఇప్పుడే వస్తా'' శ్రీమతితో చెప్పి క్యాబిన్‌లోకెళ్లా. ఓ అగంతకుడు చెప్పాపెట్టకుండా లోనికి రావడం వల్ల కొన్ని క్షణాలు వాడి ముఖంలో ఆశ్చర్యం, కోపం రెండూ పులుముకున్నాయ్. నన్ను ఎగాదిగా చూసాడు. అంతే, వెంటనే గుర్తుపట్టి, ''నీవు రాజేంద్రవి కదూ?'' అడిగాడు.

''అవున్రా భడవా!'' ముప్పై ఏళ్ల ముందెప్పుడో వాడిన 'భడవా' అన్న మాట ఆ క్షణం నా నోట్లోంచి ఎలా వచ్చిందో? ఈమధ్యకాలంలో ఆ పదాన్ని వాడనే లేదు! అలా అన్నందుకు వాడేమీ ఫీల్ కాడు కదా? కానీ వాడేమీ ఈ విషయం పట్టించుకున్నట్లే లేదు.

''మనం నర్సాపూర్‌లో, ముప్పై ఏళ్ల ముందు కదూ?'' సంభ్రమంగా ఏదో అంటున్నాడు. వాడి పేరు మహేశ్. నాకు గుర్తొచ్చింది.

నేను తలవూపా, నా కనుబొమలు సంతోషంతో అప్రయత్నంగా పైకి లేచాయ్.

''రావోయ్... కూచో'' కుర్చీ చూపించాడు.

ఆ కుర్చీ లాక్కుని కూర్చున్నా. బయట కౌంటర్‌కేసి సంజ్ఞ చేస్తూ, ''అదుగో ఆవిడ నా శ్రీమతి. వాడు మా చిరంజీవి'' దూరం నుంచే వాళ్లని పరిచయం చేసా.

''పిలువుమరి'' ఎలక్ట్రిక్ బెల్ నొక్కాడు. నేను మా వాళ్లని రమ్మని సంజ్ఞ చేసా. వాళ్లు లోనకొచ్చాక పరస్పర పరిచయాలయ్యాయ్.

మహేశ్ కూల్‌డ్రింక్స్ తెప్పించాడు.

సిప్ చేస్తూ కాసేపు కబుర్లు చెప్పుకున్నాం. తర్వాత వీలు చూసుకొని ఓసారి ఇంటికి రమ్మని వాడికి చెప్పా.

''ఎక్కడ కుదురుతుందిరా! ఈ బిజినెస్సే నా జీవితం! ఉదయం తొమ్మిది కొస్తాను. రాత్రి తొమ్మిది వరకూ ఇక్కడే! వారానికి ఓరోజు శెలవు. ఆరోజే బిజినెస్ పనులు మరింత బిజీ! మీరే వీలు చూసుకొని ఓసారి ఇంటికి రావాలి!'' ఓ క్షణం ఆగి విజిటింగ్ కార్డ్ తీసిస్తూ, ''ఆదివారం ఇంట్లోనే వుంటాను'' చెప్పాడు. అక్కడికి వాడెంతో బిజీ మనిషి అయినట్లూ, నేనో సాధారణమైనవాడిననీ. అయితే నేనా విషయం పట్టించుకోలేదు. ''అలా గేలే..'' అన్నా.

★★★

లైఫ్‌ను ఇంచుమించు రీసైకిల్ చేసేది హార్ట్ సర్జరీ. అది నా వృత్తి. అంటే నా జీవితానికి సార్థకత వుందన్నమాటే! కానీ నా వైయుక్తిక జీవితానికే అర్థం లేదు! యాంత్రిక జీవితం! ఇందులో సుఖం, తీరిక ఇలాంటి వాటికి చోటే వుండదు. కానీ ఇక ఈ తీరు మార్చుకోవాలి. లైఫ్‌ని ఎంజాయ్ చేయాలంటే అప్పుడప్పుడూ తీరిక చేసుకోవాలి! అలా నిర్ణయించుకున్నాక ఓ ఆదివారం మహేశ్ వాళ్లింటికెళ్లా.

అది ఇల్లులా కాకుండా ఓ చిన్ని ప్యాలెస్‌లా వుంది. కానీ-నీరు లేని నుయ్యిలా, వాడకంలేని గంగాళంలా, అందులో ఏమిటో వెలితి! ఇంట్లో ఓ పనివాడు తప్పితే ఎవ్వరూ లేరు. నేను వెళ్లేటప్పటికి ఏవో అకౌంట్సు చూసుకుంటున్నాడు. నన్ను చూడగానే ఆ పని ఆపేసాడు.

''హలో, రావోయ్ రాజా..'' వాడి పిలుపులో అవ్యక్తమైన ఆనందం వుంది, నాలోనూ..! వెంటనే కబుర్లలో పడిపోయాం.

చిన్ననాటి కబుర్లు, వాటి జ్ఞాపకాలు చాలా మధురంగా వుంటాయ్. సంసార సాగరంలో తలమునకలవుతున్న ఎవరికేనా తృళ్లుతూ హాయిగా ఆటపాటలతో నిశ్చింతగా గడపిన ఆ అల్లరి చిల్లరి బాల్యపు స్మృతులు ఆనందంగా వుంటాయి మరి! గంటలు ఎలా దొర్లిపోయాయో మాకే అర్థం కాలేదు!

ప్రస్తుతం మహేశ్ వంటరిగాడు! వాడి పిల్లలెక్కడున్నారో వాడికే తెలీదు! అయినా క్షణం తీరిక లేనిది జీవితం! బిజీ... బిజినెస్... అంతా గజిబిజి!

''నీవు మరీ బిజినెస్ మైండెడ్‌వి..'' మనసులో మాటని పైకి నవ్వుతూ అనేశా.

''నా తత్వం తెలుసు కదరా? చిన్నప్పట్నుంచీ కష్టం చేసి బ్రతికిన వాణ్ని! నీకు గుర్తుండే వుంటుంది. నర్సాపూర్‌లో మా నాన్నగార్కి ఓ చిల్లర కొట్టు మాత్రం వుండేది. ఆయన పోయాక 'శ్రమే సర్వస్వం' అన్న సిద్ధాంతంలో దాన్ని ఇంత పెద్ద చేసా. ఇవాళ నాకు శ్రమ సాఫల్యమే కాకుండా మరో రెండు షోరూమ్సు వున్నాయ్. అన్నీ స్వకష్టంతో, చెమటోడ్చి సంపాదించినవి!'' వాడి మాటల్లో గర్వం లేదు. ''నీవు బిజినెస్ మైండెడ్‌వి '' అన్నదానికి కేవలం వివరణ ఇస్తున్నాడంతే! క్షణం తర్వాత తల విదిలిస్తూ ''నా పిల్లలకి మాత్రం నా లక్షణాలు అబ్బలేదురా. జులాయి వెధవలు! వాళ్లదదో తీరు! స్వంత బ్రతుకులు బ్రతకడానికి ఎవరిదారులు వారు చూసుకున్నారు! మాట వరుసకు చెబుతున్నాగానీ నీవొచ్చావని... లేకపోతే వాళ్ల గురించి నాకు ఆలోచనలే రావు! ఆలోచించడానికి వ్యవధే వుండదు!'' చెప్పాడు.

నా కళ్లు ముడుచుకున్నాయ్! తమాషాయే! నేనే ఎంతో బిజీ అనుకుంటున్నా! ప్రొఫెషన్‌కి అంకితమయి ఫామిలీతో గడపడానికి కూడా వీలుండడం

లేదని భావిస్తూంటే మహేశ్ ఏకంగా వాళ్లకు దూరంగా వుంటూ వాళ్ల తలపులే రానంత బిజీగా వుంటున్నాడు! సుఖంగానూ వుండగల్గుతున్నాడు! వాస్తవానికి సుఖం అంటే ఇది అని ఏమీ వుండదు! మనం ఆనందించగలిగింది ఏదైనా సుఖమే! వాడికి సంపాదనే సుఖం కావచ్చు! కష్టపడ్డమే ఆనందాన్నివ్వొచ్చు! కానీ ఎక్కడో ఏదో వెలితుంది'' నా మనస్సంటోంది.

''నీవు కష్టజీవివే! అది నీ శ్రమసాఫల్యమే చెబుతోంది! కానీ ఇలా పిల్లల్ని వదలి వుండడంలో అర్థం లేదురా. పోతే నీ శ్రమసాఫల్యంలో సాఫల్యం వుందేమో గానీ సరైన అర్థంలో శ్రమేమీ లేదు! రోజంతా కూచోవడం శ్రమ, ఎగ్జర్షన్ అనిపించుకోదు! వాతావరణం చల్లగా వున్నా... చూడు, నీకు లైట్‌గా చెమటపడుతోంది! నీవు ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు'' అన్నా.

''తీరిక ఎక్కడిదిరా? అయినా కాస్త వొళ్లు చేసాను కదా? ఇలా చెమట అప్పుడప్పుడూ పడుతూనే వుంటుంది. ప్రతీ చిన్న విషయానికీ గాభరా పడే మనిషిని కాను!''

''నన్ను చూడు నా ముఖంలో చూడు.''

''ఏమిటి?''

''చెమటేమైనా కనిపిస్తోందా?''

''ఎవరి శరీర తత్వాలు వారివి!''

''కాదు. శరీర తత్వాలని బట్టి రంగు, బలం, మహా అయితే జలుబు, చూపు ఇలాంటివి ఆధారపడి వుంటాయ్. చెమట, మాట, ఇవికావు! నలభై నలభై అయిదు దాటాక ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి! ఫ్రీక్వెంట్‌గా చెకప్ చేసుకోవాలి! నీవు మా హాస్పిటల్‌కు రా, మొత్తం చెకప్ చేయిస్తా!''

''ఓ.కె...చూద్దాం''

''చూద్దాం అంటే కుదరదు. నీకేదో ప్రాబ్లమ్ లేకుంటే ఇలా చెమట పట్టదు! నీ శ్వాస కూడా ఫ్రీగా లేదు! ఇవి మంచి సింప్టమ్స్ కావు! నీవు తప్పకా రేపు చెకప్ చేయించుకో..''

వాడు తేలిగ్గా నవ్వాడు.

''నవ్వకు. రేపు నీవు రావాలి. వస్తావు! మరి ఇక నేనుంటా!'' వాడికి ఇంకేమీ మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. వెళ్ళబోతున్నట్లు లేచి నిలబడ్డా.

వాడి మూతి బిగుసుకుంది. తలని నెమ్మదిగా పైకీ క్రిందకీ వూపాడు- సరేనన్నట్లు.



★★★

మరుసటిరోజు మహేశ్ హాస్పిటల్‌కొచ్చాడు. పరీక్షలన్నీ నేనే స్వయంగా చేసా. తర్వాత చాలాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నాం. వాడి ఆరోగ్యంలో ఏదో పెద్ద లోపమున్నట్లుందని ఆ క్షణంలో చెప్పకూడదనుకుంటూనే చెప్పకుండా వుండలేకపోయా. కానీ వాడు పెద్దగా పట్టించుకోలేదు. సన్నగా నవ్వి వూరుకున్నాడు. గుండెబలం కలవాడే!

ఆ మరుసటి రోజు పరీక్షల తాలూకు రిపోర్ట్స్ తయారయ్యాయ్! ఇప్పుడు నాకు సందేహం, వాటిని మహేశ్‌కు ఇవ్వాలా అఖ్ఖర్లేదా! వాటి గురించి అసలు చెప్పాలా వద్దా?

**ఎం.దామోదర్‌రావు**

నేను చెప్పబోయే విషయం వాడికి మంచి చేస్తుందా, హానే కల్గిస్తుందా? ఏమో?! అతి సున్నితమైన విషయం! అది భయంకరమైన రోగమనీ... బ్రతకడం రోజుల్లో వుందనీ డాక్టర్‌గా నేను చెప్పగూడదు! మిత్రుడిగా అసలే చెప్పకూడదు! కానీ చెప్పకుంటే వాడి చరమజీవితం ఇల్లానే ముగుస్తుంది! అది సబబు కాదు. కాబట్టి చెప్పే తీరాలి. నిర్ణయించుకున్నా.

వాడి రిపోర్టు తీసుకుని వెంటనే శ్రమసాఫల్యానికి వెళ్లా. నన్ను చిరునవ్వుతో ఆహ్వానించాడు. నేనూ చిరునవ్వు కోసం ప్రయత్నించా. కానీ నా నవ్వు సహజంగా లేదు. నాకే కృత్రిమంగా అనిపించింది!

''ఏరా, రిపోర్ట్స్ ఏమంటున్నాయ్?'' అడిగాడు.

చెప్పాలో వద్దో. నాకు మళ్లీ అనుమానం. ఎంత దృఢంగా నిర్ణయించుకొని వచ్చినా ఇప్పుడు చెప్పాలంటే సంకోచంగానే వుంది! దిక్కులు చూస్తూ కూర్చున్నా. నా తీరు వాడికి కాస్త అనుమానం కలిగించిందేమో?!

''ఏరా, విషయమేంటి?'' కాస్త కలవరంగా అడిగాడు.

నేను నీళ్లు నములుతూ, ''నిజం చెప్పాలో వద్దో అర్థం కావడం లేదు'' అన్నా.

''ఏమిటి?''

''చెబితే, నిన్ను పూరకే కలవరపెట్టడం అవుతుంది!''

''డాక్టర్లతో ఇదే గొడవ! వద్దంటే చెకప్ చేయించుకోమని అప్పుడు బల వంతం, ఇప్పుడేమో- నాన్చక అసలు విషయమేంటో చెప్పు.''

''మెడికల్ టర్మ్స్‌లో చెబితే నీకు అర్థం కాకపోవచ్చు..''

''ఎలా తోస్తే అలా చెప్పు''

''ఇది వొక క్యూర్‌లెస్ ట్యూమర్''

వాడి ముఖం క్షణార్ధంలో తెల్లగా పాలిపోయింది-

''నిజం చెబుతున్నావా?''

వాడిని చూస్తే నాకు బాధేసింది. నాకు నటించడం వచ్చని ఎప్పుడూ అనుకోలేదు. జవాబు చెప్పకుండా ఎటో చూస్తుండిపోయా...

''చెప్పరా రాజూ!'' నా భుజం పట్టి కుదిపాడు. ''జోక్‌గానీ చేస్తున్నావా? నేను పర్ఫెక్ట్లీ నార్మల్‌గా వున్నా తెలుసా? నీవు వేరెవ్వరి రిపోర్ట్సో చూసుంటావు?!''

''కాదురా. అలా జరగడానికి ఆస్కారం లేదు. నీ బ్లడ్ టెస్ట్ నేనే చేసా కదా? నీది మాత్రమే చేసా! ఎక్కడా పొరబాటు లేదు. వైరస్ మైక్రోబియల్ కౌంట్‌ని బట్టి జబ్బు ప్రారంభదశలో వుంది. కానీ దీనికి రెమిడీ లేదు.''

''మరి?''


చెప్పలేని విషయాలు చెప్పడం వరకూ వస్తే, ఆ చెప్పడం చాలా కఠినమైన పనే! కొన్ని క్షణాలు నా నోట్లో మాటలు లోనే ఆగిపోయాయ్! తర్వాత నెమ్మదిగా చెప్పా. ''ఇంకో రెండు లేక మూడు వారాలు- నీవు ఏ జబ్బూ లేనట్లే నార్మల్‌గా వుంటావు. సింప్టమ్సు అప్పటిగ్గానీ బయటపడవు. తర్వాత రోజులు కూడా కష్టం అవుతాయి.''

మహేశ్ ఏమీ మాట్లాడలేదు. ఆపై నేనూ మాట్లాడలేకపోయా. ఈ విషయం చెప్పకుండా వుంటేనే బాగుండేదేమో? మౌనం దుర్భరంగా వుంది. మళ్లీ నేనే అన్నా, ''ఈ విషయం మనసులోకి రానీకురా. చెప్పకపోవలసింది, కానీ నీ సుఖం కోసమే చెప్పా. ప్రతీ మనిషికీ కొన్ని కోర్కెలుంటాయి! అవి తీరి తీరాలి!! ఆత్మ అసంతృప్తిగా మిగలకూడదు. అందుకే-''

''ఆపరా రాజూ. నాకీ విషయం చెప్పకుంటేనే బావుండేది! చెప్పి భయంకరమైన పొరబాటు చేసావ్! ఓ.కె. నుదుట ఇలాగని రాసుంటే నీవుమాత్రం ఏం చేయగలవ్?'' ఆ మాటలు నాకు నిష్ఠూరంగా అనిపించలేదు. మహేశ్ కాలింగ్ బెల్ నొక్కి కూల్‌డ్రింక్స్ తెప్పించాడు. నాకు కూల్‌డ్రింక్ చేదుగా అనిపిస్తోంది. తాగలేకపోతున్నా.

కాసేపటి తర్వాత సడన్‌గా, ''ఫ్రాంక్‌గా చెప్పరా- నాకిక ఎన్రోజులు మిగిలాయి?'' అడిగాడు.

''ఖచ్చితంగా చెప్పడం కష్టం. ఇంచుమించు ఇరవై, ఇరవైవొక్క రోజులు..''




''పోనీ ఇరవై రోజులే అనుకుందాం. ఈవాల్టి నుంచీ కౌంట్‌డౌన్ చేయాలన్నమాట!''

నేను మాట్లాడలేదు. తర్వాత మౌనం భరించలేక విషయం మారుస్తూ, ''పదరా క్లబ్బుకెళదాం, మనసు బాగుంటుంది'' అన్నా. వాడు వెంటనే స్పందించలేదు. కాసేపు తర్వాత మాత్రం హఠాత్తుగా నిర్ణయించుకున్నట్లు నిలబడుతూ ''పద'' అన్నాడు.

అప్పుడు నాకు స్ఫురించింది. ఇవాళ సాయంత్రం మా అబ్బాయిని ఫ్లైట్‌కు పంపాలి!

''ముందు మా ఇంటికెళ్లి- భోంచేసి వెళ్దాం..'' అన్నా.

''వద్దు మంచి హోటల్‌కు వెళ్దాం''

''ఇవాళ మా అబ్బాయి న్యూయార్క్ వెళ్తున్నాడురా. కాబట్టి ఇంటికి వెళ్లే తీరాలి... ప్లీజ్.''

ఒప్పుకున్నాడు. మొదటిసారి మా ఇంటికొచ్చాడు. మొదట్లో ట్యూమర్ విషయం చెప్పినప్పుడు వాడు షాక్ తిన్నమాట వాస్తవమేగానీ తర్వాత ఆ భావాలేవీ ముఖంలో కనబడనీయడం లేదు. ఆ విషయం పట్టనట్లే నిబ్బరంగా వుంటున్నాడు. ఇది నాకు కొండంత శక్తినిస్తోంది!

మా ఇంటి భోజనం వాడికి నచ్చింది. ''ఇంత మంచి తిండి తిని ఎన్నో ఏళ్లయ్యాయమ్మా'' నా శ్రీమతితో అన్నాడు. వాస్తవానికి మేము స్పైసెస్ వాడం! ఉప్పుకారాలు కూడా తక్కువగా వుంటాయ్! నా శ్రీమతితో ఫ్రీగా కలిసిపోయాడు. 'చెల్లెమ్మా' అంటూ మాట కలుపుకొని కొసరి కొసరి వడ్డించుకున్నాడు. మా అబ్బాయితో కూడా చక్కగా మాటలు కలుపుకున్నాడు. మాతో, మాలో వొక్కడిగా కలిసిపోయాడు. వాడలా వుండడం నాకు తృప్తిగా వుంది!

సాయంత్రం మాతో ఎయిర్‌పోర్ట్‌కొచ్చాడు. మా అబ్బాయికి వీడుకోల్చు చెబుతున్నప్పుడు నా శ్రీమతి కన్నీటిని కంట్రోల్ చేయలేకపోయింది. నాకూ వీలుకాలేదు. ఆఖరివరకూ ఆపుకున్న ఒకటి రెండు బొట్లు రాలనే రాలాయ్! వాటిని మహేశ్ గమనించినట్లున్నాడు. ఎటో శూన్యంలోకి చూడసాగాడు. బహుశా వాడి మనసు పిల్లల గత జ్ఞాపకాల్లోకి వెళ్లుండాలి. దుఃఖాన్ని దాచుకోలేకపోతున్నాడు.

మా అందరి మనసులూ బరువుగా తయారయ్యాయ్! ఫ్లైన్ కనుమరుగయ్యే వరకూ ఆగి తిరుగుముఖం పట్టాం. చాలాసేపు మా మధ్య ఏ మాటలూ లేవు. మహేశ్ మధ్యలో ఓసారి శ్రమసాఫల్యానికి ఫోన్ చేసి తానివాల్టికి రావడం లేదనీ, వేళకాగానే సెంటర్ కట్టేయమనీ చెప్పాడు. అలాగే రెసిడెన్స్‌కు ఫోన్‌చేసి రాత్రి భోజనం వద్దన్నాడు.

''ఏరా భోజనం వద్దన్నావేంటి?'' అడిగా.

''మళ్లీ రాత్రి మీకు కష్టం యివ్వనులేవోయ్. అందరం హోటల్లో భోంచేద్దాం. అయినా చెల్లెమ్మ చేతి వంట తినే సౌభాగ్యం వుందంటే ఉన్న ఇరవై రోజులూ మీ ఇంటికే వస్తూంటా..''

''ఇరవై రోజులేమిటి? వదినగారు ఇంట్లో లేరాండీ?'' నా శ్రీమతి అడిగింది. ఆమెకు వాడి విషయాలేమీ తెలీవు.

''నా భార్య చనిపోయి ఎన్నో ఏళ్లయిందమ్మా'' బాధని వ్యక్తం చేయకూడదని వ్యర్థ ప్రయత్నం చేసాడు మహేశ్. నావైపు తిరిగి, ''అదృష్టవంతురాలు, కదరా? సౌభాగ్యవతిగా పోవడం అదృష్టం కదూ? ఇవాళ బ్రతికుంటే..'' వాడి గొంతక్కడ పూడు

కుపోయింది.

నేను ఆప్యాయంగా వాడిని చేతులతో చుట్టి వూరడింపుగా భుజం మీద తట్టా. ఆ పరిస్థితిలో ఏం మాట్లాడాలన్నా అసహజంగానే వుంటుంది. అయినా వాడి దుఃఖాన్ని శమింపజేయడానికి వాడినలా మౌనంగా వదలడమే భావ్యంగా తోచింది.

రాత్రి హోటల్ గోల్కొండలో భోజనం చేస్తూ మహేశ్ వాడి పిల్లల విషయం ఎత్తాడు. ఆ మాట నాకెంత సంతోషాన్ని ఇచ్చిందని! వాడు వాడి పిల్లలతో కలిసి హాయిగా బ్రతకడం మినహా ఓ స్నేహితుడిగా నేను వేరేమి కోరగలను? ఓ విధంగా ఇలా జరగాలనుకున్న నా కోరిక ఫలించింది! మనిషికి ఆశించింది జరిగినప్పుడు కలిగే ఆనందం అనిర్వచనీయం! ఎప్పుడో నాలుగేళ్ళ క్రితం స్వతంత్రించి ప్రేమ పెళ్ళిళ్ళు చేసుకున్న పిల్లల్ని త్యజించి... వాళ్ళని మరచిపోయిన మహేశ్ హృదయం ఇప్పుడు మళ్ళీ వాళ్ళకోసం చేతులు చాస్తోంది! రక్త సంబంధంలోని తీపి ఎంత మధురమైంది!

మహేశ్ తర్వాత ఎప్పుడూ దిగులుగా కనిపించలేదు! క్షణ భంగురమైన జీవితాన్ని హాయిగా గడిపేయాలన్న తత్వాన్ని జీర్ణించుకున్నాడు! ఎప్పుడూ హాయిగా నవ్వుతూ తుళ్ళుతూ చిన్నపిల్లాడిలా వుంటున్నాడు. వాడి పిల్లల వునికిని తెలుసుకుందుకు వార్తాపత్రికల్లో, టీవీ ఛానల్స్‌లో ప్రకటనలిచ్చాడు.

★★★

రోజులు దొర్లిపోతున్నాయ్. మేము కలవని రోజు వుండడం లేదు. వాడి కోసం నేను హాస్పిటల్‌కి వెళ్ళడం ఇంచుమించు మానుకున్నా. సాధ్యమైనంత వరకూ వాడితోనే గడుపుతున్నా. నా శ్రీమతి సరేసరి. 'కొత్త అన్నయ్య' నచ్చినట్లున్నాడు. రోజూ కొత్త కొత్త వంటలు చేసి పెడుతోంది. బోలెడన్ని కబుర్లు చెబుతోంది. వాడు ఖరీదైన పట్టుచీరలు తెచ్చిస్తున్నాడన్న సంగతి కాదుగానీ వాళ్ళిద్దరి మధ్యా నిజాయితీ నిండిన అనుబంధం ఏదో చోటు చేసుకుంది! ఆ అన్నాచెల్లెళ్ళ మధ్యన అప్పుడప్పుడూ నేనే పానకంలో పుడకనవుతున్నా.

ఓ రాత్రి-తొమ్మిది దాటింది. ఉబుసుపోక టీవీ చూస్తున్నా. డోర్‌బెల్ మోగింది. నా శ్రీమతి వెళ్ళి తలుపు తీసింది. ఈ వేళలో ఎవరొచ్చారు చెప్మా? అనుకుంటూండగానే మహేశ్ దూసుకొచ్చాడు. వాడి చేతుల్లో ఓ బాబు! వాడి వెనుకే ఓ దంపతుల జంట!

''ఓరేయ్... రాజూ, ఎవరొచ్చారో చూడు!'' తలుపు దగ్గర్నుంచే అరిచాడు. ఆ ఆనందాన్ని చూస్తూంటే ఆ వచ్చిన వారెవరో ఇట్టే తెలిసిపోయింది నాకు.

''నా మనవడ్రా!'' మళ్ళీ మహేశే అన్నాడు బాబుని పైకెత్తుతూ.

''తాతవయిపోయావన్నమాట'' నవ్వా.

మాకు పరిచయాలు జరిగాయి. ఆ వచ్చింది మహేశ్ వాళ్ళబ్బాయి సురేషూ అతడి భార్య వనజ. ఆ బాబు వారి సంతానం.

''ఇప్పుడే అరగంట క్రితమే వచ్చారు. వస్తూనే ఇలా తీసుకొచ్చేసా.. నీ మూలానే కదరా మేము కలుసుకోవడం! వీళ్ళిక ఇక్కడే వుంటారు. 'శ్రమసాఫల్యం' సురేషు చూసుకుంటాడు. ఇక నా పని కేవలం మనవడితో ఆడుకోవడం.'' హుషారుగా అన్నా చివరి మాట వచ్చినప్పుడు వాడి స్వరం మారింది. కళ్ళు చెమర్చాయి. 'ఇంకెంతకాలం ఆడగలగడం?' అన్న ఆలోచన వచ్చుండొచ్చు. వాడు ట్యూమర్ విషయంగానీ వాళ్ళబ్బాయికి చెబుతాడేమోనని నాకు కంగారు వేసింది. 'పిల్లలకా విషయం తెలియనీకు' అన్న సంగతి తిన్నగా చెప్పలేక అస్తవ్యస్తంగా ఏదో అనేశా. నా అవస్థ చూసి వాడు నవ్వాడు.

''నాకు తెలియదా రాజూ? సుఖదుఃఖాలు మనకు దేవుడిచ్చేవి! వాటిని మనం కొనలేము. అమ్మనూ లేము. వాటిని ఎలా వాడుకోవాలన్నది మాత్రమే మన చేతుల్లో వుంది! అది కూడా నీ మూలానే తెలిసింది.''

''నీది వుత్తి భావుకత్వం!'' అన్నా. తర్వాత, ''నీకో అమ్మాయి కూడా వున్నట్లు చెప్పావు...ఆమె విషయం తెలీలేదా?'' అడిగా.

నా ప్రశ్నకు సురేష్ చెప్పుకుపోయాడు. ''మా చెల్లి మొన్నటి వరకూ పూనాలో వుండేదండి. ట్రాన్స్‌ఫర్ మీద కొత్తచోటకి వెళ్తున్నట్లు మూడు రోజుల ముందే వుత్తరం వచ్చింది. వెళ్ళంగానే కొత్త అడ్రసు రాస్తానంది.''

''ట్రాన్స్‌ఫర్ ఎక్కడికైందో తెలుసా?'' అడిగా

''తెలీదండీ''

''రాజూ!'' మహేశ్ కంగారుపడ్డాడు. ''వీళ్ళొచ్చిన సంతోషంలో పద్మ విషయమే మరచిపోయారా. వాళ్ళిక్కడ ఆంధ్రాలో లేకుంటే నేనిచ్చిన ప్రకటనలు కూడా వాళ్ళకందవ్. ఎలారా? అమ్మాయిని ఓసారి చూసి తీరాలి..''

వాడి కంగారుకి అర్థం లేకపోలేదు. కౌంట్‌డౌన్‌లో నాలుగైదు రోజులు మాత్రమే మిగిలుంటాయి! ఏం చేయాలి? ఏం చెప్పాలి? వెంటనే నాకో ఐడియా స్ఫురించింది! ఫోన్ డైరెక్టరీ వెదకి గ్లోబ్ డిటెక్టివ్ ఏజెన్సీకి ఫోన్ చేసా. అరగంటలోపే ఏజెన్సీ మనిషి వచ్చాడు. అన్ని వివరాలూ తీసుకుని ''వాళ్ళెక్కడున్నా వారంలోపే మీకు తెలియజేస్తాం'' చెప్పాడు.

నేను థాంక్స్ చెప్పా.

''వారం రోజులా?'' మహేశ్ స్వరం ప్రళయంలో ఇరుక్కున్నట్లుంది! మళ్ళీ ఏదో చెప్పబోయాడు. నేను వారిస్తూ వాడిని దూరంగా తీసుకెళ్ళా.

''చూడు మహేశ్'' నెమ్మదిగా చెప్పుకుపోయా, ''మనిషి జీవితానికి ఓ పరమార్థం వుంటుంది. కానీ దాన్ని మించి మనుగడకు శాంతి, స్వాంతన అవసరం! అవి వున్నప్పుడే మనిషి దేన్నయినా సాధించగలడు. అవి లోపిస్తే పరమార్థానికి కూడా అర్థం వుండదు! తననుమాలిన ధర్మం..లా అవుతుంది! చరమ దశలో మనిషికి సుఖం డబ్బు ఇవి సరిపోవు! స్వాంతన ఆలంబన అవసరం. లేకపోతే..'' బహుశా నా వుపోద్ఘాతం పెద్దదైనట్లుంది! వాడు మధ్యలోనే నా భుజం పట్టి కుదుపుతూ, అరచినంత పని చేసాడు.

''ఒరే నా ప్రాణం తీయకు. మెట్టవేదాంతం చాలించు. కౌంట్ డౌన్‌లో నాకిక నాల్గురోజులే మిగిలాయి!'' వాడి ముఖంలో భయం చూసి నాకు నవ్వొచ్చింది. వాడి భుజం తడుతూ నెమ్మదిగా చెప్పుకుపోయా, ''నీవు మొదటిసారి నీ పిల్లల విషయం మాట్లాడినపుడు నీకు చెమట పట్టింది. గుర్తుందా? చూడు మిత్రమా- మనిషికి ఏదైనా చాలా బాధగానీ, భయంగానీ కలిగినప్పుడు మాత్రమే అలా చెమట పడుతుంది! అది సహజం! అప్పుడే నేను గ్రహించా, తాత్కాలికమైన పట్టింపువల్ల నీవు పిల్లల్ని దూరం చేసుకున్నావుగానీ వాళ్ళు లేకుండా నీవు వుండలేవు! ఆ క్షణంలోనే మిమ్మల్ని కలపాలని నిర్ణయించుకున్నా! అందుకే ఇదంతా నేనాడిన నాటకం! నీకే ట్యూమరూ లేదురా! నిజం చెబుతున్నా! కౌంట్‌డౌన్‌లో నీకు-నీవు కౌంట్ చేయలేనన్ని రోజులు ఇంకా మిగిలే వుంటాయ్!''

''నిజమా?'' నన్ను ఆనందంగా హత్తుకున్నాడు. వాడి కళ్ళు చెమ్మగిల్లాయ్! కళ్ళుకి ఎంత అద్భుతమైన వైవిధ్యం! బాధకే కాదు, ఆనందానికి కూడా అవి చెమరుస్తాయ్! ★

**మిల్టరీలో ఉద్యోగావకాశాలు**

**మిల్టరీలో ఉద్యోగావకాశాలు గలవు. ఆసక్తి ఉన్నవారికి 45 రోజుల శిక్షణ ఇవ్వబడును. విద్యార్హత : 7వ తరగతి నుండి డిగ్రీ వరకు, వయస్సు : 16 సం.ల నుండి 22 సం.ల వరకు, బరువు : 50 Kg., ఎత్తు: 5.5" ఛాతీ 77-82cm. పై అర్హతలు ఉన్నవారు క్రింది అడ్రసుకు రూ. 100/- (M.O) మనియార్డరు చేసి అప్లికేషన్ ఫారములు, ప్రాస్పెక్టస్ పొందండి.**

DIRECTOR
**PRE-DEFENCE ACADEMY**
EWS-1011, Kukatpally Housing Board Colony.
Hyderabad-72. Ph : 3151108, 3051765